సాక్షి
సిద్దిపేట
శుక్రవారం । 7 । మార్చి । 2025



పాడి రైతుకు ప్రోత్సాహం

పాల సేకరణ ధర పెంపునకు విజయ డెయిరీ చర్యలు తీసుకుంటోంది.


వివరాలు 8లో ▸



అడ్డదిడ్డం.. ఆగమాగం

రాజీవ్ రహదారి పక్కన ఉన్న ఓ హోటల్ వద్ద వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడంతో ఇబ్బందికరంగా మారింది.

వివరాలు 9లో ▸



న్యూస్‌రీల్

మహిళలకు ఉచిత న్యాయ సలహాలు

న్యాయమూర్తి స్వాతిరెడ్డి



కేక్ కట్ చేస్తున్న న్యాయమూర్తి స్వాతిరెడ్డి

హుస్నాబాద్: మహిళలకు ఏ సమస్య తలెత్తినా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఉచిత న్యాయ సలహాలు పొందవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని గురువారం మహిళ సంఘాల సభ్యులకు లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయన్నారు. గెలిచేది ఆడ, మగ అని కాదని, నైపుణ్యం, సమర్థత ఎవరికి ఉంటుందో వారే ఉన్నతమైన హోదాలో ఉంటారన్నారు. ఆలోచనలో మార్పు రావాలని, ఆ మార్పుకు మహిళలే తొలి అడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, సీడీపీఓ జయమ్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, న్యాయవాదులు పాల్గొన్నారు.

దరఖాస్తులు తక్షణం పరిష్కరించండి

సీపీ అనురాధ



మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ఫిర్యాదు బాక్సులలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సీపీ అనురాధ సిబ్బందికి సూచించారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో షీటీమ్, భరోసా, స్నేహిత మహిళా సెంటర్ సిబ్బందితో సీపీ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పిల్లలు, మహిళల రక్షణకు మేమున్నామని పూర్తి నమ్మకం, భరోసా కల్పించాలన్నారు. హాట్ స్పాట్‌లపై మరింత నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పిల్లలు సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. హాట్‌స్పాట్ పరిసర ప్రాంతాల్లో ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేయాలని సీఐ దుర్గకు సూచించారు. బాలికలు, అబ్బాయిలు కనబడితే వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. ఏవరైనా వేధిస్తే డయల్ 100 లేదా షీటీమ్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్‌గౌడ్, షీటీమ్, భరోసా సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తైబజార్ డబ్బుల రికవరీలో అవినీతి

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీలో తైబజార్ వేలం పాటకు సంబంధించి డబ్బుల రికవరీలో అవినీతి చోటు చేసుకుందని సీఐటీయూ, కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి, కాంగ్రెస్ జిల్లా నాయకులు శ్రీధర్‌రెడ్డి, రమేశ్ గురువారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 2018 నుంచి తాము తైబజార్ వేలానికి సంబంధించి వివరాల కోసం ఆర్టీఐ ద్వారా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా, తప్పుడు సమాచారం ఇచ్చారని మండిపడ్డారు. తైబజార్ వేలం పాటలో తీర్మానించిన మేరకే సంబంధిత కాంట్రాక్టర్ వద్ద డబ్బులు వసూలు చేయాల్సి ఉండగా, రికార్డుల్లో మాత్రం తప్పుడు వివరాలు నమోదు చేశారని తెలిపారు. ఈవిషయమై మున్సిపల్ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్యారానగర్‌లో సర్వేయర్ల బృందం పర్యటన

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం నల్లవల్లి సమీపంలోని ప్యారానగర్ గ్రామంలో సంగారెడ్డి ఏడీ ఆధ్వర్యంలో సర్వేయర్ల బృందం గురువారం పర్యటించింది. డంప్‌యార్డ్ ఏర్పాటుకు సంబంధించి హైకోర్టు ఆదేశాల మేరకు వారు పర్యటించారు. అటవీ రెవెన్యూశాఖ అధికారుల సమక్షంలో సర్వే చేసి హద్దులు గుర్తించారు. సర్వే రిపోర్టును ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు అధికారుల బృందం వెల్లడించింది. కాగా ప్యారానగర్‌లో డంప్‌యార్డ్ ఏర్పాటును నిరసిస్తూ చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు గురువారం 30వ రోజుకు చేరుకున్నాయి.

చేనేతలకు మరింత భరోసా

సిద్దిపేటజోన్: చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, వారికి మరింత భరోసా ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని పీసీసీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ తెలిపారు. సీఎంను నగరంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. చేనేత పరిశ్రమకు కొత్త సంక్షేమ పథకాలను అమలు చేసి కార్మికులను ఆదుకుంటామని, అన్ని సమస్యలపై అధ్యయనం చేస్తున్నామని సీఎం చెప్పారన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న పథకాలు అర్హులైన చేనేత కార్మికులకు అందేలా పనిచేయాలని సూచించినట్లు తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన పీసీసీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

సాగునీటిని అందించండి

మంత్రి ఉత్తమ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



మంత్రి ఉత్తమ్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎంపీ చామల, కాంగ్రెస్ నాయకులు, రైతులు

చేర్యాల(సిద్దిపేట): తపాసుపల్లి రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపి చేర్యాల ప్రాంత రైతులకు సాగునీరు అందించాలని పలువురు కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈమేరకు గురువారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి పలువురు కాంగ్రెస్ నాయకులు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేర్యాల ప్రాంత రైతన్నలు సాగు నీటి కోసం పడుతున్న కష్టాలను మంత్రికి వివరించామన్నారు. స్పందించిన మంత్రి రంగనాయకసాగర్ డీ10 కెనాల్ ద్వారా కమలాయపల్లి, అర్జునపట్ల, ఆకునూరు, జాలపల్లి, లింగాపూర్, దూల్మిట్టకు సాగునీరు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అలాగే దేవాదుల ఎత్తిపోతల పథకం ఫేజ్–3 మోటార్లు ప్రారంభించి గండిరామారం, బొమ్మకూరు, వెల్దండ, తపాసుపల్లి రిజర్వాయర్లను నింపి రైతులకు సాగు నీరు ఇవ్వాలని అధికారులను మంత్రి ఆదేశించారని వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మద్దూరు, చేర్యాల మాజీ జెడ్పీటీసీలు గిరి కొండల్‌రెడ్డి, కొమ్ము నర్సింగరావు, నాయకులు, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

చెంతనే ప్రాణాంతక చెట్లు

'కోనోకార్పస్'తో ముప్పు!

- జిల్లా వ్యాప్తంగా విస్తరింపు
- పేరు వింటేనే హడలిపోతున్న జనం
- వెంటాడుతున్న శ్వాసకోశ వ్యాధులు
- గాలి పీల్చినా ప్రమాదమే
- జీవ వైవిధ్యానికి.. పర్యావరణానికి హాని
- తొలగించాలని సర్వత్రా డిమాండ్
- అయినా స్పందించని అధికారగణం



జిల్లా కేంద్రంలో దారి పొడవునా కోనోకార్పస్ చెట్లు

మిరుదొడ్డి(దుబ్బాక): పచ్చదనం, అందం, ఆకర్షణీయంగా కనిపించే కోనోకార్పస్ చెట్టు పేరు వింటేనే గ్రామీణ, పట్టణ ప్రజలు హడలి పోతున్నారు. ఈ చెట్టు ఉన్న ప్రాంతాల్లో అన్నీ సమస్యలే అంటూ జనం బెంబేలెత్తుతున్నారు. నీటి తడి లేకున్నా సరే మండుటెండలో సైతం పచ్చగా చిగురిస్తూ సకల సమస్యలను తెచ్చిపెడుతోంది. పచ్చదనం పరిశుభ్రత పేరుతో గత హరితహారం కార్యక్రమాల్లో నాటిన ఈ కోనోకార్పస్ చెట్లు జనాలకు రోగాలను తెచ్చిపెడుతున్నాయి. ఈ చెట్లు పుష్పించి వెదజల్లే పుప్పొడి వల్ల దీర్ఘకాలిక వ్యాధులకు ఆజ్యం పోస్తాయని డాక్టర్లు సైతం హెచ్చరిస్తున్నారు. వెంటనే ఈ చెట్లను తొలగించాలని సర్వత్రా డిమాండ్ వినిపిస్తున్నా అధికార యంత్రాంగం ముందుకు రావడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఎలాంటి ఉపయోగం చేని చెట్టు

హరితగ్రామాలుగా తీర్చి దిద్దాలన్న లక్ష్యంతో గ్రామీణ పట్టణ ప్రాంతాలు అన్న తేడా లేకుండా అధికారులు లక్షల్లో కోనోకార్పస్ చెట్లను నాటారు. నీటి ఎద్దడిని తట్టుకునే ఈ చెట్లు తక్కువ కాలంలోనే పచ్చగా ఎదుగుతూ ఆకర్షణీయంగా మారాయి. ముఖ్యంగా ఈ చెట్ల ఆకులును పశువులుగానీ తినలేవు. కనీసం పక్షులు కూడా వాలలేవు. గూళ్ళు సైతం కట్టలేవు. ఇక రాత్రయిందంటే చాలు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దుష్ప్రరిణామాలను చూపించే ఈ చెట్లు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

అనారోగ్య సమస్యలు ఉత్పన్నం

మండుతున్న ఎండల్లో సైతం ఈ చెట్లు పచ్చగా కళకళలాడే ఈ కోనోకార్పస్ చెట్లు సకల రోగాలను అంటగడుతున్నాయని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఈ చెట్లు పుష్పించి గాలిద్వారా వెదజల్లే పుప్పొడి వల్ల శరీరంపై అలర్జీ, ఆస్తమా, శ్వాసకోశ సంబంధ వ్యాధులకు ఆజ్యం పోస్తుందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడే వారు ఈ చెట్లకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

చెట్ల వేళ్లతో సతమతం

అనారోగ్య సమస్యలను తెచ్చిపెట్టే ఈ కోనోకార్పస్ చెట్ల వేళ్లు సైతం సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. ముఖ్యంగా తాగు నీటి సమస్యను అస్తవ్యస్తం చేస్తూ వేళ్లు పాతుకు పోతున్నాయి. మిషన్ భగీరథ పైపుల్లోకి వెళ్ళు చొచ్చుకెళుతుండటంతో నీటి పరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయి గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి పరఫరాను పున:రుద్ధరించడం కోసం మిషన్ భగీరథ సిబ్బంది నానా అవస్థలు పడాల్సి వస్తుంది.

నిషేధం ఉన్నా..

దేశంలోని తెలంగాణ రాష్ట్రంతో పాటు, ఆంధ్ర, గుజరాత్, అసోం, కర్ణాటక వంటి రాష్ట్రాలు నిషేధించినప్పటికీ క్షేత్ర స్థాయిలో అధికారులు మాత్రం హరితహారంలో విరివిగా కోనోకార్పస్ చెట్లను నాటుతున్నారు.

చెట్ల చరిత్ర ఇదీ..

కోనోకార్పస్ చెట్లు నాటిన నాటి నుంచి తక్కువ కాలంలోనే వేరు వ్యవస్థ వేగంగా పాతుకుపోవడం వల్ల చెట్లు నిండుగా పచ్చదనంతో ఆకర్షణీయకంగా పెరుగుతాయి. పాశ్చాత్య దేశాల్లో రోడ్లు, పార్కులు, ఉద్యానవనాల్లో సుందరీకరణ కోసం పెంచితే, ఉష్ణ దేశాల్లో సంభవించే ఇసుక తుపాన్లను అడ్డుకోవడానికి తీర ప్రాంతాలల్లో కోనోకార్పస్ చెట్లను విరివిగా పెంచుకుంటారు. అయినప్పటికీ ఎక్కువగా దుష్ఫరిణామాలు కలిగించే ఈ చెట్లను చాలా దేశాలు నిషేధించాయి కూడా.

చెట్లను తొలగించండి



ఈ చెట్ల వల్ల అనారోగ్య సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నాం. ఇప్పటికే అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. తాగు నీటి పైపుల్లోకి చెట్ల వేర్లు చొచ్చుకెళ్లడంతో నల్లా నీళ్లు సరిగ్గా రావడం లేదు. అధికారులు వెంటనే స్పందించి కోనోకార్పస్ చెట్లను తొలగించాలి.

- తుమ్మల బాల్‌రాజు, మాజీ సర్పంచ్, కాసులాబాద్

అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి



ఈ చెట్ల నుంచి వెలువడే పుప్పొడి వల్ల ఆస్తమా వ్యాధి గ్రస్తులు నరక యాతన అనుభవించాల్సి వస్తుంది. గాలి ద్వారా వ్యాప్తి చెందే పుప్పొడి రేణువులను పీల్చడం వల్ల ఊపిరి తిత్తుల్లో సమస్యలు ఏర్పడే అవకాశాలు మెండుగా ఉంటాయి. చర్మ ఎలర్జీలు సంభవిస్తాయి. శ్వాస కోశ సంబంధ వ్యాధి గ్రస్తులు ఈ చెట్టు పరిసరాల్లో ఉండక పోవడం మంచిది. చెట్లు పుష్పించక ముందే శాఖలను ఎప్పటికప్పుడు తొలగించాలి.

- లింగమూర్తి, సీహెచ్ఓ, పీహెచ్‌సీ, మిరుదొడ్డి

సుందరీకరణ పేరుతో విష వృక్షాలు




సుందరీకరణ పేరుతో రోడ్ల వెంట, పార్కులు, పల్లె ప్రకృతి వనాల్లో అధికారులు అనాలోచితంగా నాటిన ఈ కోనోకార్పస్ విష వృక్షాలు ఇప్పుడు ప్రజా సమస్యలకు దారి తీస్తున్నాయి. ప్రజలకు హాని కలిగించే ఇలాంటి కోనోకార్పస్ చెట్లను తొలగించాల్సిందే. వాటి స్థానాల్లో మంచి ఆరోగ్యాన్ని, పండ్ల నిచ్చే చెట్లను విరివిగా నాటాలి. పర్యావరణం కలుషితం కాకుండా ప్రజారోగ్యాన్ని కాపాడాలి.

- పి.శంకర్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి

ఎమ్మెల్సీ రేసులో సీపీఐ

చాడాకు చాన్స్ దక్కేనా?

- అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ
- హుస్నాబాద్‌లో కాంగ్రెస్ గెలుపునకు కృషి
- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీకి షెడ్యూల్ విడుదల



చాడ వెంకట్ రెడ్డి



సాక్షి, సిద్దిపేట: తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. ఎమ్మెల్సీ స్థానాల్లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డికి అవకాశం దక్కుతుందా లేదా అన్న చర్చ జిల్లా వ్యాప్తంగా సాగుతోంది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ పొత్తు పెట్టుకున్నాయి. అందులో రెండు ఎమ్మెల్సీలకు అవకాశం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చినట్లు సమాచారం. ఎమ్మెల్సీలు హసన్ మీర్జా, ఎగ్గె మల్లేశం, శేరి సుభాష్ రెడ్డి, మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్ పదవీ కాలం ఈ నెల 29వ తేదీతో ముగయనుంది. దీంతో రాష్ట్రంలో ఐదు ఎమ్మెల్సీ లు ఖాళీ అవుతున్నాయి. వాటిని భర్తీ చేసేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ గత నెల 28న షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 10న నామినేషన్ల స్వీకరణ, 11న పరిశీలన, 13న నామినేషన్ల పరిశీలన, 20న పోలింగ్ ఉండనుంది.

మొదట హుస్నాబాద్ సీటుపై..

అసెంబ్లీ ఎన్నికల్లో.. కాంగ్రెస్, సీపీఐ పార్టీల పొత్తులో భాగంగా హుస్నాబాద్ ఎమ్మెల్యే సీటును సీపీఐకి కేటాయించాలని పట్టు పట్టారు. హుస్నాబాద్, కొత్తగూడెంలలో సీపీఐకి పట్టు ఉండటంతో గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆ పార్టీ రెండు స్థానాలను అడిగారు. చివరకు హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా పొన్నం ప్రభాకర్‌కు కేటాయించారు. పొత్తులలో కొత్తగూడెం సీటును కూనంనేని సాంబశివరావుకు కేటాయించారు. సీపీఐ అధిష్టానం సూచించిన ఇద్దరికీ ఎమ్మెల్సీలుగా అవకాశం ఇస్తామని గతంలోనే హామీ ఇచ్చినట్లు ప్రచారం.

పొన్నం గెలుపు కోసం..

హుస్నాబాద్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి పొన్నం ప్రభాకర్ గెలుపొందేందుకు సీపీఐ నేతలు కీలక పాత్ర పోషించారు. ఎన్నికల ప్రచారంలో నిత్యం పాల్గొని విజయానికి కృషి చేశారు.

చాడాకు అవకాశం వచ్చేనా?

2004లో ఇందుర్తి నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా చాడ వెంకట్ రెడ్డి గెలుపొందారు. రేకొండ సర్పంచ్‌గా, చిగురుమామిడి ఎంపీపీ, జెడ్పీటీసీగా చాడ వెంకట్‌రెడ్డి పని చేశారు. దీనితో తనకు అవకాశం ఇవ్వాలని పార్టీ అంతర్గత సమావేశాల్లో చర్చించినట్లు తెలిసింది. చాడ కే అవకాశం దక్కుతుందని అంతా ఎదురు చూస్తున్నారు.కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్‌లను కలిసిన సీపీఐ నేతలు

ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో కాంగ్రెస్‌కు 4, బీఆర్ఎస్‌కు ఒక ఎమ్మెల్సీ దక్కే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు దక్కే వాటిలో సీపీఐకి ఒకటి అవకాశం ఇవ్వాలని ఇప్పటికే సీపీఐ నేతలు సీఎం రేవంత్‌రెడ్డిని, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిశారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, సీపీఐ నాయకులు చాడా వెంకట్ రెడ్డి, తక్కెల్లపల్లి శ్రీనివాస్ రావులు కలిసిన వారిలో ఉన్నారు.

పీఎఫ్ కార్యాలయ తరలింపు నిలిపివేత

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని పీఎఫ్ కార్యాలయాన్ని తరలించవద్దని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయను కోరగా, వెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేశారని ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. గురువారం నగరంలో జరిగిన తెలంగాణ జోనల్, రీజినల్ పీఎఫ్ కార్యాలయ బిల్డింగ్ ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, మన్సుఖ్ మాండవీయాలు హాజరయ్యారన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఉన్న పీఎఫ్ కార్యాలయాన్ని ఇక్కడి నుంచి తరలించకుండా చొరవ చూపాలని ఎంపీ కేంద్రమంత్రిని కోరినట్లు తెలిపారు. అందుకు గాను కార్యక్రమంలోనే పీఎఫ్ కమిషనర్ రమేష్‌కృష్ణమూర్తికి ఆదేశాలు జారీ చేశారన్నారు. సిద్దిపేట పీఎఫ్ కార్యాలయ తరలింపును నిలిపివేయడంతో ఎంపీ మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

రెండో రోజూ ఇంటర్ పరీక్షలు ప్రశాంతం



సిద్దిపేటలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

- 97 శాతం హాజరు
- పరీక్ష కేంద్రాల ఆకస్మిక తనిఖీలు

సిద్దిపేట ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పేపర్లు తెలుగు, హిందీ, సంస్కృతం తదితర పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జనరల్, ఒకేషనల్ మొత్తం కలిపి 9,452 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 335 మంది గైర్హాజరు అయ్యారు. 9117 మందితో 97శాతం హాజరు నమోదైంది. జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి పట్టణంలోని ప్రభుత్వ కోఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంతో పాటు పలు ప్రైవేట్ కళాశాలల పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఈసీ సభ్యులు గంగాధర్, జ్యోతి ఉదయం పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లోని కస్టోడియన్ సెంటర్‌ను సందర్శించి ప్రశ్నపత్రాల బెండల్స్‌ను సీఎస్, డీఓలకు పంపిణీ చేసే విధానాన్ని పర్యవేక్షించారు. హైపవర్ కమిటీ సభ్యులు హిమబిందు చేర్యాల, ముస్త్యాల కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు తొగుట, మిరుదొడ్డి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించి సీఎస్, డీఓలను వివరాలు అడిగి తెలుసుకుని, రికార్డులను పరిశీలించి పలు సూచనలు, సలహాలను అందించారు.

ఇక్కడి పాలు ఇక్కడే విక్రయం

సేకరించిన రోజే సరఫరా

- స్వచ్ఛమైన, నాణ్యమైన పాలే లక్ష్యం
- రైతు, వినియోగదారుడు రెండు కళ్లు
- విజయ డెయిరీ ప్రభుత్వ రంగ సంస్థకు చెందినది
- 'సాక్షి'తో విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న విజయ డెయిరీ డీడీ శ్రీనివాస్

సాక్షి, సిద్దిపేట: జిల్లాలోని పాడి రైతుల నుంచి సేకరించిన పాలను ఇక్కడే విక్రయిస్తున్నామని విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్(డీడీ) శ్రీనివాస్ తెలిపారు. వినియోగదారులకు కల్తీ లేకుండా, స్వచ్ఛమైన, నాణ్యమైన పాలను అందించడమే లక్ష్యమన్నారు. జిల్లా వ్యాప్తంగా 295 పాల సేకరణ కేంద్రాలున్నాయన్నారు. రోజుకు దాదాపు 30వేల లీటర్ల పాలను 7,400 మంది రైతుల నుంచి సేకరిస్తున్నామని చెప్పారు. 'సాక్షి'తో డీడీ శ్రీనివాస్ మాట్లాడుతూ అదే రోజూ పాలను ప్యాకింగ్ చేసి ఫ్రెష్‌గా అందిస్తున్నామన్నారు. ఇతర ప్రైవేట్ డెయిరీలైతే.. సేకరించిన తర్వాత రెండు రోజుల తరువాత మార్కెట్‌లో పాలను విక్రస్తుంటాయన్నారు. విజయ పాల పేరుతో పలువురు ఇతర ప్రైవేట్ డెయిరీలలో ప్యాకింగ్ చేసి విక్రస్తున్నారని మా దృష్టికి వచ్చిందని, ఆ పాలతో ప్రభుత్వ రంగ సంస్థ అయిన తెలంగాణ విజయ పాలకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. వినియోగదారులు అందరూ విజయ తెలంగాణ లోగో ఉందో లేదో చూసి కొనుగోలు చేయాలని కోరారు.

సన్న, చిన్నకారు రైతుల నుంచే..

విజయ డెయిరీకి రైతు, వినియోగదారుడు రెండు కళ్లు లాంటి వారన్నారు. దేశంలో ఎక్కడా కొనుగోలు చేయని ధరకు రైతుల దగ్గరి నుంచి పాలను విజయ డెయిరీ కొనుగోలు చేస్తోందన్నారు. సన్న, చిన్నకారు రైతుల నుంచే మా సంస్థ పాలను ఎక్కువగా కొనుగోలు చేస్తోందని శ్రీనివాస్ వివరించారు. విజయ తెలంగాణ పాలలో కృత్రిమ పదార్థాలు కలపబోమని, రైతు నుంచి సేకరించిన పాలనే అందిస్తున్నామన్నారు. వినియోగదారులకు ఎలాంటి కల్తీ లేకుండా, స్వచ్ఛమైన నాణ్యమైన పాలను అందించడంలో రాజీపడబోమన్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో విజయ తెలంగాణ పాలనే అందజేస్తున్నామని, అలాగే కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయానికి సైతం విజయ నెయ్యినే సరఫరా చేస్తున్నామని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

52 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడ్డ ఆటో, రేషన్ బియ్యం

చిన్నకోడూరు(సిద్దిపేట): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ కథనం మేరకు.. నమ్మదగ్గ సమాచారం మేరకు గురువారం మండల పరిధిలోని మల్లారం చౌరస్తా వద్ద తనిఖీలు చేస్తుండగా సిద్దిపేట పట్టణానికి చెందిన వానరాశి రాజు ఆటోలో ఎలాంటి అనుమతులు లేకుండా 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించాం. నిందితుడు రాజుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే, మండల పరిధిలోని సికింద్లాపూర్‌లో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన ముక్కెర కనకయ్య, సంపత్‌ల ఇంట్లో బియ్యాన్ని నిల్వ చేయడంతో ఇరువురిపై కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని మహిళ మృతి



మహిళ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆసిఫ్ అలీ కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జాతీయ రహదారి పక్కన పెట్రోల్ బంక్ సమీపంలో పంచర్ షాపు డబ్బా వెనుకాల గుర్తు తెలియని పడిపోయి ఉంది. మహిళకు చీమలు పట్టి ఉండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మహిళను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి వయస్సు 50 ఏళ్ల వరకు ఉంటుందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



కుమార్ (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురువారం కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని కంచన్‌పల్లి గ్రామానికి చెందిన బోయిని కుమార్(38) కొత్తగా ఇల్లు కట్టాడు. ఇంటి నిర్మాణం కోసం కొంత భూమి అమ్మగా మిగితా డబ్బులు అప్పులు చేశాడు. అప్పులు తీర్చమార్గం లేకపోడంతో 3న ఇంటి దాబా పైకి ఎక్కి పురుగుల మందుతాగాడు. గమనించిన భార్య జ్యోతి మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురు వారం మృతి చెందినట్లు తెలిపారు. జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళా వాకర్స్‌ను ఢీకొట్టిన బైక్

ముగ్గురికి గాయాలు

రామాయంపేట(మెదక్): వాకింగ్‌కు వెళ్తున్న మహిళలను వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన గురువారం సాయంత్రం రామాయంపేట పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణానికి చెందిన సౌమ్య, లావణ్య, శ్రీలత, మరో ముగ్గురు మహిళలు సాయంత్రం వేళ కామారెడ్డి రోడ్డు వైపు వాకింగ్‌కు వెళ్తున్నారు. వెనుక నుంచి అతివేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మద్యం సేవించడంతోనే ఈ ప్రమాదం జరిగిందని తెలిసింది. ఈ విషయమై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ బాల్‌రాజ్ పేర్కొన్నారు.

కుంటలో పడి శవమై తేలి



యాదగిరి(ఫైల్)

గజ్వేల్‌రూరల్: ప్రమాదవశాత్తు కుంటలో జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సంగుపల్లిలో చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల కథనం మేరకు.. సంగుపల్లికి చెందిన బడె యాదగిరి(43), నిర్మల దంపతులకు నలుగురు ఆడ పిల్లలున్నారు. యాదగిరి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. 3న ఇంట్లో కుటుంబ సభ్యులకు బహిర్భూమికి వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టు పక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం నిర్మల తమ బంధువులతో కలిసి గ్రామ శివారులోని పాతకుంట వద్ద వెతుకుతుండగా యాదగిరి మృతదేహం కనిపించింది. ఈ విషయాన్ని పోలీసులకు తెలుపగా వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాడి రైతుకు ప్రోత్సాహం

- గేదె పాల సేకరణలో రూ.3 పెంపు!
- విజయ డెయిరీ ప్రతిపాదనలు
- జిల్లా నిత్యం 11 వేల లీటర్లు సేకరణ
- పాడి రైతులకు రూ.10 లక్షల వరకు ఆదాయం



నారాయణఖేడ్: తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య ఆధ్వర్యంలోని విజయ డెయిరీ పాల సేకరణ ధర పెంపునకు చర్యలు తీసుకుంటుండటంతో జిల్లాలోని పాడి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. తద్వారా పాడి ఉత్పత్తి సైతం పెరిగేందుకు అవకాశం ఏర్పడింది. విజయ డెయిరీ ద్వారా సేకరిస్తున్న గేదె పాల ధరలను సవరించి లీటరకు రూ.3 చొప్పున పెంచేందుకు యాజమాన్యం యోచిస్తుంది. ఇతర రాష్ట్రాల్లోని పాల దిగుమతిని తగ్గించడంతో పాటు విజయడెయిరీ పాల సేకరణ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు రాష్ట్రంలోని పాడి రైతులకు ప్రయోజనం చేకూర్చేలా విజయ డెయిరీ ధర పెంపుపై చర్యలు తీసుకుంటుంది.

లీటరుకు రూ.51

ప్రస్తుతం లీటరుకు విజయ డెయిరీ ద్వారా రైతుకు రూ.48 చెల్లిస్తున్నారు. దీన్ని రూ.3 పెంచి లీటరుకు రూ.51 చేయాలని ప్రతిపాదించారు. ఆవు పాలకు గేదె పాలతో సమానంగా చెల్లిస్తుండడం, ఆవు పాల ధర అధికంగా ఉండటంతో దాని ధరను తగ్గించాలని ఆలోచిస్తున్నారు. అత్యధికంగా గేదె పాల సేకరణ జరుగుతోంది.

2,500 మంది రైతులకు మేలు..

జిల్లాలో నారాయణఖేడ్, జహీరాబాద్, పుల్కల్, జోగిపేట, తడ్కల్, కోహీర్, సదాశివపేట, మామిడిపల్లిల్లో మినీ పాలశీథరలీకరణ కేంద్రాలు ఉన్నాయి. వీటికి తోడు 160 పాల సేకరణ కేంద్రాలు కొనసాగుతున్నాయి. 2,500 మంది రైతుల ద్వారా నిత్యం 11 వేల లీటర్ల పాల సేకరణ జరుగుతుంది. ధర పెంపు కారణంగా బయటి వ్యక్తులు, సంస్థలకు వెళ్లే పాలు నేరుగా విజయడెయిరీకి చేరుకోనున్నాయి. తద్వారా విజయ డెయిరీకి పాల సేకరణ పెరగడంతోపాటు రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

జిల్లాలో 70 వేల వరకు గేదెలు

గతంలో 15 వేల లీటర్ల పాల సేరణ జిల్లాలో జరుగుతుండగా ప్రస్తుతం 11 వేల లీటర్లు సేకరిస్తున్నారు. వేసవి ప్రారంభంతో ఎండలు ముదిరిన పక్షంలో పచ్చిక బయళ్ల తగ్గడం, గ్రాసం, తాగునీటి సమస్యల కారణంగా పాల ఉత్పత్తి కూడా తగ్గే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో 70 వేల వరకు గేదెలు ఉండగా, 30 వేల వరకు ఆవులు ఉన్నాయి. ఆవు పాల సేకరణ వెయ్యి లీటర్ల వరకే ఉండగా గేదె పాల సేకరణ 10 వేల వరకు ఉంది. సేకరిస్తున్న పాలలో గతంలో 5 శాతం ఫ్యాట్ (వెన్నశాతం) వస్తుండగా ప్రస్తుతం ఆ ఫ్యాట్ 6 శాతంకు పెరిగింది. పాల ధర పెంపువల్ల రైతులకు జిల్లాలో రూ.10 లక్షల వరకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

పాడి గేదెలు ఇప్పించేందుకు కృషి

విజయ డెయిరీ పాల సేకరణ ధర పెంచాలన్న ఆలోచన వల్ల జిల్లాలోని పాడి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఇంకా పెంపు అధికారికంగా ఉత్తర్వులు రాలేదు. ధర పెంపువల్ల గేదె పాలసేకరణ పెరుగనుంది. వ్యవసాయంతోపాటు అనుబంధంగా ఉన్న పాడి ఉత్పత్తులు పెరిగేందుకు అవకాశం ఉంది. మిత్రాలోన్, పీఎంఈజీపీ తదితర పథకాల ద్వారా బ్యాంకు రుణాలు పాడి గేదెలు ఇప్పించేందుకు కృషి చేస్తాం. పాడి సంపద పెంచి రైతులకు ప్రయోజనం జరిగేలా కృషి చేస్తాం.

– గోపాల్ సింగ్, డిప్యూటీ డైరెక్టర్, విజయడెయిరీ, సంగారెడ్డి



కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఆయా కంపెనీల ప్రతినిధులు, విద్యార్థులు

నైపుణ్యం ప్రదర్శించేందుకు ఈ బాహ వేదిక

నర్సాపూర్: విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ఈ బాహ సే ఇండియా వేదిక లాంటిదని ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ బాల్‌రాజ్ సుబ్రమణ్యం సూచించారు. ఇటీవల నర్సాపూర్‌లోని బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీలో ఈ బాహ సే ఇండియా పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నిర్వహణలో భాగస్వామ్య కంపెనీలు గురువారం బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీలో క్యాంపస్ సెలెక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. యువ ఇంజనీరింగు విద్యార్థుల ప్రతిభ, నైపుణ్యాలను ప్రదర్శించడానికి, అడ్డంకులు, సవాళ్లను అధిగమించి నిజ జీవిత అనుభవాన్ని పొందడానికి ఈ బాహ పోటీలు దోహదపడుతాయని వివరించారు. కాలేజీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె మాట్లాడుతూ.. క్యాంపస్ సెలక్షన్‌లో 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు పలు రకాల పరీక్షలు నిర్వహించారని తెలిపారు. సెలెక్షన్స్‌లో కాలేజీకి చెందిన సుమారు 600 మంది విద్యార్థులు రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల ప్యాకెజీతో ఉద్యోగాలు పొందారని వివరించారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు

- వన్ టౌన్ సీఐ వాసుదేవరావు
- సిద్దిపేటలో నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న సీఐ వాసుదేవరావు, సిబ్బంది

సిద్దిపేటకమాన్: గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు నిల్వ ఉంచినా, విక్రయించినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట వన్ టౌన్ సీఐ వాసుదేవరావు తెలిపారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని పలు దుకాణాలు, పాన్‌షాపులు, బస్టాండ్ ప్రాంతాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో తమ సిబ్బందితో కలిసి నార్కోటిక్ డాగ్స్‌తో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాల నివారణ గురించి తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పిల్లలు, యువత గంజాయి, మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. మత్తు పదార్థాలు కలి గిన చాక్లెట్ విక్రయించినా వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల గురించి ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100 లేదా యాంటీ నార్కోటిక్ బ్యూరో టోల్ ఫ్రీ నంబర్ 1908కు సమాచారం అందించాలని సూచించారు. తనిఖీల్లో డాగ్ స్క్వాడ్ సిబ్బంది, వన్ టౌన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి

ప్రతిభ పరీక్షలో రాణించిన విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థుల ప్రతిభను వెలికితీసే భాగంలో కాగ్నిజెంట్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభ పరీక్షల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్ విద్యార్థులు రాణించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సిద్దిపేట అర్బన్ మండల విద్యాధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రతిభ పరీక్షలో పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు. వీరికి కాగ్నిజెంట్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ సంస్థ ఉచితంగా ల్యాప్‌టాప్ అందజేయడంతోపాటు, అన్ని రకాల పోటీ పరీక్షలకు ఆన్‌లైన్‌లో తరగతులు అందించనున్నట్లు తెలిపారు.

కడుపులోంచి క్యాన్సర్ కణతి తొలగింపు

ఆర్‌వీఎంలో అరుదైన శస్త్రచికిత్స



మాట్లాడుతున్న ఆస్పత్రి వైద్యులు

ములుగు(గజ్వేల్): ములుగు ఆర్‌వీఎం ఆస్పత్రిలో కడుపునొప్పితో బాధపడుతున్న రోగికి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. గురువారం ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ కథనం మేరకు.. హన్మకొండ జిల్లా నడికుడ మండలం రామక్రిష్ణపురం గ్రామానికి చెందిన ఎరుకల సాంబయ్య(65) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లోని ప్రముఖ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నప్పటికీ నయం కాలేదు. పది రోజుల కిందట సాంబయ్య ఆర్‌వీఎం ఆస్పత్రిలో చేరారు. వైద్యులు జనరల్ సర్జన్ శ్రీనివాస్, సర్జికల్ ఆంకాలజిస్ట్ ఎంఎస్ కీర్తి, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ సుబ్రహ్మణేశ్వర బాబు, అనెస్థీసియా వైద్యుడు వంశీకిరణ్ పరీక్షలు నిర్వహించి రోగి కడుపులో ప్యాంక్రియాటిస్ క్యాన్సర్‌తో కూడిన భారీ కణతి ఉన్నట్లు గుర్తించారు. సుమారు 10 గంటల పాటు శస్త్ర చికిత్స చేసి కణతిని విజయవంతంగా తొలగించారు. సాంబయ్య కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని ప్రముఖ ఆస్పత్రుల్లో జబ్బు నయం కావడానికి రూ.8 నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారన్నారు. అంత ఖరీదైన చికిత్సను ఆర్‌వీఎం ఆస్పత్రి వైద్యులు ఆరోగ్యశ్రీ ద్వారా చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని ఆత్మహత్య

రామంచలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి



శ్రీకాంత్ రెడ్డి(ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉరేసుకొని రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండల పరిధిలోని రామంచలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎడ్ల శ్రీకాంత్ రెడ్డి(40) గతంలో ఆర్మీలో పని చేసి రిటైర్‌మెంట్ అయ్యాడు. ఇతడికి భార్య శ్రీలక్ష్మితోపాటు కూతురు, తల్లి లక్ష్మి ఉన్నారు. తండ్రి తిరుపతిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శ్రీకాంత్ రెడ్డి దంపతులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. వ్యాపారాల నిమిత్తం అప్పులు చేసి పెట్టుబడులు పెట్టగా నష్టం రావడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. దీంతో మనస్తాపం చెంది రెండు రోజుల కిందట రామంచ గ్రామంలో ఉంటున్న తల్లి వద్దకు వచ్చాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తల్లికి ఫోన్ ద్వారా సమాచారం అందించి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ బాలకృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి భార్య శ్రీలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రెడ్డిపల్లిలో అసిస్టెంట్ రేషన్ డీలర్



ప్రభాకర్(ఫైల్)

చేగుంట(తూప్రాన్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రెడ్డిపల్లి కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రెడ్డిపల్లి కాలనీకి చెందిన మద్దూరి ప్రభాకర్ (37) అసిస్టెంట్ రేషన్ డీలర్‌గా పని చేస్తున్నాడు. నాలుగు రోజుల కిందట భార్యతో కలిసి అత్తగారింటికి వెళ్లాడు. రేషన్ పంపిణీ కోసమని ఇంటికొచ్చిన ప్రభాకర్ బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

ముత్తన్నపేట గ్రామంలో...



రవి (ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ముత్తన్నపేట గ్రామంలో చోటు చేసుకుంది. బెజ్జంకి ఎస్ఐ క్రిష్టారెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన గాజె రవి(45)కి తల్లిదండ్రులు, భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పిల్లలను బీటెక్ చదివిస్తున్నాడు. తమకున్న వ్యవసాయ భూమితోపాటు కొంత కౌలుకు తీసుకొని పంట సాగు చేస్తున్నాడు. పంటల పెట్టుబడితో పాటు చదువులకు అప్పుల చేశాడు. కొద్ది రోజులుగా అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందుతున్నాడు. బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగాడు. ఇది గమనించిన భార్య రేణుక చుట్టుపక్కల వారి సాయంతో భర్త రవిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించింది. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యం



రాజు(ఫైల్)

జహీరాబాద్ టౌన్: వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలోని అల్గోల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ కాశీనాథ్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరుపుల రాజు(40)కి భార్య కూతురు ఉన్నారు. వ్యవసాయం పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 2న పనులకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్నాడు. అతడి భార్య పద్మ చర్చికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి భర్త రాజు కనిపించలేదు. బంధువులు, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

దొంగతనం కేసులో జైలు

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం అనంతగిరిపల్లిలో దొంగతనానికి పాల్పడిన నిందితుడికి గురువారం గజ్వేల్ కోర్టు న్యాయమూర్తి ప్రియాంక ఏడాది జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారని గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. చాంద్‌ఖాన్‌మక్తకు చెందిన ఫాస్ట్ ఫుడ్ సెంటర్ చెఫ్ పాయినమైన సుధాకర్(30) అక్టోబర్ నెలలో అనంతగిరిపల్లిలో దొంగతనానికి పాల్పడగా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. ఈ కేసు విచారించిన గజ్వేల్ కోర్టు న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్షతోపాటు జరిమానా విధించారని ఎస్ఐ వివరించారు.

పురోహితుడు బలవన్మరణం

సిద్దిపేటకమాన్: పురోహితుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సిద్దిపేట పట్టణంలోని గాడిచర్లపల్లిలో గురువారం చోటు చేసుకుంది. సిద్దిపేట వన్‌టౌన్ ఎస్ఐ కనకయ్య కథనం మేరకు.. మధ్యప్రదేశ్ రాష్ట్రం సాత్నా జిల్లాకు చెందిన కృష్ణ అనూజ్ త్రిపాఠి(24) గతేడాది బతుకు దెరువు నిమిత్తం సిద్దిపేటకు వచ్చి పట్టణంలోని ఓ పురోహితుడి వద్ద పౌరోహిత్యం చేసుకుంటూ గాడిచర్లపల్లిలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. కృష్ణ సోదరుడు రామ్‌దినశర్మ గురువారం ఇంటికి వచ్చి చూసేసరికి లోపల ఫ్యాన్‌కు ఉరేసుకొని విగతజీవిగా కనిపించాడు. ఆందోళనకు గురైన అతడు స్థానిక పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిని బెదిరించి డబ్బులు చోరీ

పోలీసుల అదుపులో నిందితులు

జోగిపేట(అందోల్): పట్టపగలే ఓ వ్యక్తిని గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బెదిరించి నగదు దోచుకెళ్లారు. ఎస్ఐ పాండు కథనం మేరకు.. పుల్కల్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన ఎర్రగొల్ల అనుకిషోర్ బుధవారం జోగిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో దిగి పట్టణంలోని తమ బంధువుల వద్దకు వెళ్తున్నాడు. మార్కెట్ రోడ్డు గుండా నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బెదిరించి అనుకిషోర్ వద్ద ఉన్న రూ.13 వేలు దొంగిలించుకుపోయారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మార్కెట్‌లో అనుమానంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా మరొకరి వ్యక్తితో కలిసి డబ్బులు దొంగిలించినట్లుగా ఒప్పుకున్నాడు. కర్ణాటకలోని భీమా నగర్ బాల్కికి చెందిన శివకుమార్, జహీరాబాద్ ప్రాంతానికి చెందిన ఐలాష్ పూర్ ఆకాశ్‌పై కేసు నమోదు చేసి గురువారం కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

పౌల్ట్రీ ఫామ్‌లో కోళ్లు మృత్యువాత



ట్రాక్టర్‌లో మృతి చెందిన కోళ్లు

శివ్వంపేట(నర్సాపూర్): కోళ్లు మృత్యువాత పడిన ఘటన మండల పరిధి గూడూర్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తాళ్లపల్లి తండాకు చెందిన లోకేశ్ గూడూర్‌లో పౌల్ట్రీ ఫామ్‌ని లీజుకు తీసుకొని ప్రీమియం కంపెనీ ద్వారా కోళ్లను పెంచుతున్నాడు. మూడు రోజుల నుంచి కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటి వరకు 4 వేల కోళ్లు మృతి చెందినట్లు లోకేశ్ తెలిపాడు. మృతి చెందిన కోళ్లను జేసీబీ గుంతలో పూడ్చి వేయించినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని పశు వైద్యాధికారి సంధ్యారాణి దృష్టికి తీసుకెళ్లగా కోళ్లు మృత్యువాత పడిన సమాచారం లేదని ఫామ్‌లలో కోళ్లు మృతి చెందితే గుంత తీసి పూడ్చివేయాలని మండల వ్యాప్తంగా ఉన్న కోళ్ల ఫామ్ యజమానులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.

చెరువులో స్నానానికి వెళ్లి వ్యక్తి మృతి

జిన్నారం (పటాన్‌చెరు): చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం మేరకు.. గుమ్మడిదల మున్సిపాలిటీకి చెందిన పంచలింగాల ఆనంద్ రెడ్డికి 6న ఉదయం గ్రామస్తుడు పెబ్బేడి సాయిరామ్ ఫోన్ చేసి ఎర్రచెరువు వద్దకు రావాలని అన్నారు. ఇద్దరూ కలిసి మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. రెండు రోజుల కిందటే చనిపోయాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి వయస్సు 50 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుందని, చెరువులో స్నానానికి వెళ్లి నీట మునిగి మృతి చెందినట్లు భావించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక డంప్ స్వాధీనం



ఇసుకను స్వాధీనం చేసుకున్న పోలీసులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ప్రాంతంలో అక్రమంగా డంప్ చేసిన ఇసుకను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మహేశ్ కథనం మేరకు.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన శేఖర్, గణేశ్, అక్కన్నపేట మండలం గోవర్ధనగిరికి చెందిన మేడబోయిన రాజు, కేశవేని రమేశ్ రాత్రి వేలలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని సమాచారం అందింది. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా వేశాం. గురువారం తెల్లవారుజామున రాములపల్లి, నాగారం, హుస్నాబాద్ పట్టణ శివారుల్లో దాడులు చేసి ఇసుక డంప్‌లను గుర్తించి 30 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మహేశ్ తెలిపారు. అలాగే రోడ్డు టిప్పర్లను పట్టుకున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, మొరం, మట్టి రవాణా చేస్తే టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

జాతీయ స్థాయికి నాలుగు ప్రాజెక్టులు ఎంపిక

గజ్వేల్‌రూరల్: జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్‌కు సెయింట్ మేరీస్ విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు ఎంపిక కావడం అభినందనీయమని ఆ పాఠశాల కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల సెయింట్ మేరీస్ విద్యానికేతన్‌కు చెందిన ఎస్ఎస్‌సీ, సీబీఎస్ఈ విద్యార్థులు రూపొందించిన 4 ప్రాజెక్టులు జాతీయ స్థాయిలో నిర్వహించే ఇన్‌స్పైర్ అవార్డ్స్‌కు ఎంపికయ్యాయి. 8వ తరగతి చదువుతు న్న దాసరి అనిల్, 7వ తరగతి విద్యార్థులు బొమ్మల్ల స్నిగ్ధ, తాళ్ల శ్రీహాస్, మార్ద నందన్ వ్యవసాయ రంగం, ప్రమాదాల రక్షణ కోసం రూపొందించిన ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ప్రిన్సిపాల్‌లు కాట రాయప్ప, విజయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



అనిల్ రూపొందించిన ప్రాజెక్టు

ఇన్‌స్పైయిర్ అవార్డుకు నలుగురు విద్యార్థులు ఎంపిక

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండలంలోని సూరారం జెడ్పీపాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైనట్లు హెచ్ఎం సాయిరెడ్డి తెలిపారు. 9వ తరగతి విద్యార్థులు నవనీత, సంధ్య, 7వ తరగతి విద్యార్థి సంపత్ కుమార్ ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, సైన్స్ ఉపాధ్యాయులు మనీష్‌రెడ్డి, రవి, హెచ్ఎం సాయిరెడ్డిని గ్రామస్తులు అభినందించారు. అలాగే నార్సింగి మండలంలోని శేరిపల్లి జెడ్పీపాఠశాల 8వ తరగతి విద్యార్థిని కట్ట ప్రవళిక ఇన్‌స్పైర్‌అవార్డుకు ఎంపికైనట్లు హెచ్ఎం తిరుపతి తెలిపారు. విద్యార్థినితోపాటు సైన్స్ ఉపాధ్యాయుడు తిరుపతిని గ్రామ ప్రజాప్రతినిధులు అభినందించారు.